
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 35.0
కనిష్ఠం 24.0
**
ANDHRAJYOTHY



సూర్యాపేట

5
బుధవారం 26 జూన్ 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.30 (122.1967)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.70 (2.71)	78.39	78.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.29 (0.38)	నిల్	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



బీబీనగర్-గుంటూరు రైల్వే డబ్లింగ్‌లో
మరో ముందడుగు

- జిల్లాలో భూ సేకరణకు గెజిట్ నోటిఫికేషన్
- మొత్తం 26హెక్టార్లకు పైగా భూసేకరణ
- రాత పూర్వకంగా అభ్యంతరాల స్వీకరణ
- న్యాయమైన పరిహారం అందించేందుకు రైల్వేశాఖ నిర్ణయం
- రైల్వే ప్రయాణికులకు మెరుగుపడనున్న సేవలు
- వ్యాపార రంగాల అభివృద్ధికి సైతం ప్రయోజనం

ఏళ్లుగా ఊరిస్తూ, ఆశలు రేకెత్తిస్తున్న బీబీనగర్-గుంటూరు రైల్వే డబ్లింగ్ పనుల్లో మరో ముందడుగు పడింది. బీబీనగర్-గుంటూరు రైల్వే డబ్లింగ్ విషయాన్ని పలు పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు లేవనెత్తడం, అది వాయిదా పడటం సర్వసాధారణంగా మారింది. బీబీనగర్-గుంటూరు జిల్లాల మధ్య ప్రయాణికుల సంఖ్య పెరిగినా, డబుల్ లైన్ లేకపోవడంతో రైళ్ల రాకపోకలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి తిరుపతి, వైజాగ్, చెన్నై, ఒడిషా, కేరళ, తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాలకు రైళ్ల రాకపోకలు తక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహారాష్ట్రంలోని షిర్డీ, కేరళ వంటి ప్రాంతాలకు వారానికి ఒక రైలు మాత్రమే నడిపిన సందర్భాలు ఉన్నాయి. బీబీనగర్-గుంటూరు మధ్య సింగిల్ రైల్వే లైన్ ఉండటంతో స్పీడ్‌గా వెళ్లే రైళ్ల కోసం కొన్ని రైళ్లను చిన్న స్టేషన్లలో చాలా సమయం నిలిపి వేయడం వంటివి జరుగుతున్నాయి. క్రాసింగ్ కోసం ప్యాసింజర్ రైళ్లులు చాలా సేపు వేచి ఉండాల్సి వస్తోంది. ఎట్టకేలకు డబ్లింగ్ పనుల్లో ముందడుగు పడటంతో ప్రయాణికుల ఇబ్బందులు తప్పనున్నాయి.

- నల్లగొండ

తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత కీలకమైన సికింద్రాబాద్, నడికుడి, గుంటూరు రైలు మార్గంలో డబుల్‌లైన్ వస్తే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందనున్నాయి. బీబీనగర్-గుంటూరు మధ్య 239కి.మీ డబ్లింగ్ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.2,853కోట్లకు పైగా నిధులను విడుదల చేసింది. అందుకు సంబంధించి రైల్వే బోర్డు దక్షిణ మధ్య రైల్వేకు లేఖ రాసింది. దీంతో నల్లగొండ జిల్లాలో భూ సేకరణకు గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన ప్రభుత్వం, మొత్తం 26హెక్టార్లకు పైగా భూమి సేకరించనుంది. ప్రధానంగా నల్లగొండ జిల్లాలో చిట్యాల మండలంలోని వట్టిమర్తితో పాటు పలు గ్రామాలు, నార్కట్‌పల్లి మండలంలోని చెరువుగట్టు, నల్లగొండ మండలంలోని అన్నెపర్తి, చర్లపల్లి, మర్రిగూడ, పానగల్లు, గొల్లగూడ, తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి, జంగారెడ్డిగూడెం, రాజుపేట, తిప్పర్తి మండల కేంద్రాల పరిధిలో సింగిల్ ట్రాక్ వెంట భూసేకరణ చేస్తారు. డబ్లింగ్ కోసం ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు డిమాండ్ చేయగా, ఎట్టకేలకు కేంద్రం పచ్చజెండా ఊపడంతో రైల్వేశాఖ పనుల కొనసాగింపునకు నిర్ణయించింది. భూసేకరణ జరిగిన వెంటనే రైల్వేశాఖ టెండర్ల ప్రక్రియ చేపట్టనుంది. దీంతో సికింద్రాబాద్ నుంచి చెన్నై, తిరుపతి మధ్య దూరభారం తగ్గనుంది. సికింద్రాబాద్ నుంచి తిరుపతి, చెన్నైకి విజయవాడ మార్గం గుండా పోలిస్తే నడికుడి, గుంటూరు మార్గంలో సుమారు 46కి.మీల దూరం తగ్గుతుంది. సికింద్రాబాద్, విజయవాడ మధ్య ప్రస్తుతం రెండు రైల్వే మార్గాలున్నాయి. అందులో ఖాజీపేట, ఖమ్మం మార్గంలో ప్రయాణిస్తే సికింద్రాబాద్, విజయవాడ మధ్య దూరం 350కి.మీలు. బీబీనగర్, నడికుడి, గుంటూరు మార్గంలో విజయవాడకు దూరం 336కి.మీలు. డబ్లింగ్ చేపడితే బీబీనగర్, నడికుడి మార్గం రద్దీగా మారనుంది.

సింగిల్ ట్రాక్ కష్టాల నుంచి త్వరలో మోక్షం



దక్షిణ మధ్య రైల్వేలో బీబీనగర్-నడికుడి సింగిల్ ట్రాక్ వినియోగం 148.25శాతం ఉంది. సింగిల్ ట్రాక్ కావడంతో ఒక రైలు ప్రయాణిస్తుంటే ఎదురుగా వచ్చే రైలును ముందు స్టేషన్లలో గంటల తరబడి నిలపాల్సి వస్తోంది. గూడ్స్ రైళ్లు కూడా గంటల తరబడి నిలుస్తున్నాయి. రైలులు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో ఉన్న సింగిల్ ట్రాక్ గరిష్ఠ వేగం 130కి.మీలు మాత్రమే. ఇప్పటికే ఈ మార్గంలో 160కి.మీల వేగ సామర్థ్యం ఉన్న రైళ్లు వేగాన్ని తగ్గించుకుని ప్రయాణిస్తున్నాయి. ఈ మార్గాన్ని డబ్లింగ్ చేస్తే రైళ్ల వేగం పెరగడంతో పాటు అదనపు రైళ్లు నడిపే అవకాశం ఉంటుంది. బీబీనగర్-గుంటూరు రైలు మార్గంలో డబ్లింగ్ చేస్తే 239కి.మీలల్లో 139కి.మీల రైల్వే ట్రాక్ తెలంగాణ పరిధిలో, 100కి.మీలు ఏపీ పరిధిలో ఉండనున్నాయి. డబ్లింగ్ పనులు రెండు తెలుగు రాష్ట్రాలకు ఉపయోగం ఉంది. తెలుగు రాష్ట్రాల నుంచి ఎగుమతయ్యే సిమెంట్, బొగ్గు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభం కానుంది. ఈ మార్గంలోనే నడికుడి, జగ్గయ్యపేట, విష్ణుపురం, జాన్‌పహాడ్ ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయి. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు ఈ రైల్వే లైన్ ఎంతగానో ఉపయోగపడనుంది.



రైతు వేదికల్లో ప్రతీ మంగళవారం
- క్లస్టర్ సమావేశం
- మండలానికో క్లస్టర్ ఎంపిక
- జిల్లాలో మొత్తం 17చోట్ల
- రైతులతో సమావేశాలు
- హాజరుకానున్న వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు

అన్నదాతకు అండగా..

అన్నదాతల అభ్యున్నతికి ప్రభుత్వాలు వివిధ పథకాలను అమలు చేస్తున్నాయి. సేద్యానికి ఉచిత విద్యుత్, ఏటా ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయం, రుణమాఫీ, రైతు బీమా ఇచ్చి అండగా నిలుస్తోంది. అయితే రైతులకు వినూత్న వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, పంట మార్పిడిపై అవగాహన కల్పించి వారి ఆలోచనా విధానంలో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో రైతు వేదికల ద్వారా రైతులకు చేరువయ్యేలా ప్రభుత్వం నిర్ణయించింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

రైతులంతా ఒక చోట చేరి సాగుబడి గురించి చర్చించేందుకు గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. అయితే ఈ వేదికల్లో ఆశించిన స్థాయిలో సమావేశాలు జరగలేదు. వీటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. రైతు వేదికల ద్వారా వ్యవసాయశాఖ అధికారులు ప్రతీ వారం రైతులకు పంటల దిగుబడితో పాటు సస్యరక్షణ, ఎరువుల వాడకం, తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 421 గ్రామపంచాయతీలను 92 క్లస్టర్లుగా విభజించి గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. ఈ వేదికల నిర్మాణానికి ప్రభుత్వం రూ.22లక్షలు వ్యయం చేసింది. వీటిని ప్రస్తుతం వ్యవసాయ విస్తరణాధికారులు కార్యాలయాలుగా వినియోగిస్తున్నారు. సీజన్లలో రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ సమావేశాల్లో రైతులంతా పాల్గొనడంలేదు. ఈ నేపథ్యంలో రైతులందరికీ అందుబాటులో ఉండేలా ఒక క్లస్టర్‌లో ప్రతీ మంగళవారం సమావేశాలు, వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. అందుకు జిల్లాలో మొత్తం 17 క్లస్టర్లను ఎంపిక చేశారు. ఈ క్లస్టర్ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, ఏవోలు, ఏఈవోలు, రాష్ట్ర కార్యాలయం నుంచి వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారు. పంటలపరంగా రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు. ఏ పంటలు సాగుచేస్తే లాభసాటిగా ఉంటుందో వివరిస్తారు. పంట మార్పిడితో పాటు సస్యరక్షణపై సలహాలు, సూచనలు చేస్తారు. రైతులు పంటల దిగుబడి కోసం పెద్ద మొత్తంలో ఎరువులను వినియోగిస్తున్నారు. అయితే ఎంత మోతాదులో ఎరువులు వినియోగించాలనే అంశంపై చాలా మంది రైతులకు అవగాహన లేదు. దీంతోపాటు, వాతావరణ పరిస్థితులను బట్టి పంటల సాగుపై అవగాహన కల్పించనున్నారు. రైతులతో సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలోకి వెళ్లి, పంటల పరిస్థితిని పరిశీలించనున్నారు. వానాకాలంలో జిల్లాలో 4.28లక్షల ఎకరాల్లో వరి, పత్తితోపాటు పలు పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం రైతులు పొలాల్లో విత్తనాలు నాటేదశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు వివరించనున్నారు.



రైతులకు సూచనలు అందించేందుకే సమావేశాలు



ప్రభుత్వం రైతులకు పంటల సాగుపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. రైతుకు రైతు వేదికల్లో ప్రతీ మంగళవారం వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహిస్తాం. విత్తనాలు ఎరువుల వాడకం, పంట మార్పిడిపై అవగాహన కల్పిస్తాం. జిల్లాలో 17 క్లస్టర్లలోని రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ సమావేశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- కె.అనురాధ, జిల్లా వ్యవసాయాధికారి

17 క్లస్టర్లలో సమావేశాలు

యాదాద్రి జిల్లాలో మొత్తం 421 గ్రామపంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలు ఉన్నాయి. వీటిలో రెండు మూడు గ్రామాలను కలిపి ఒక క్లస్టర్‌గా విభజించి రైతు వేదికలను నిర్మించారు. అయితే ప్రతీ వారం రైతులతో జిల్లా యంత్రాంగం ఎంపిక చేసిన క్లస్టర్‌లో సమావేశాలు నిర్వహించనుంది. జిల్లాలో మొత్తం 17 క్లస్టర్లలో వీడియోకాన్ఫరెన్స్‌లు, సమావేశాలు నిర్వహించేందుకు వ్యవసాయశాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు జిల్లా వారీగా రైతులకు అనుకూలంగా ఉండేలా క్లస్టర్ల ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లాలోని బీబీనగర్‌లోని రాయరావుపేట క్లస్టర్, బొమ్మలరామారం మండలంలోని మల్యాల, చౌటుప్పల్ మండలంలోని జైకేసారం, నారాయణపూర్ మండలంలోని నారాయణపూర్, ఆలేరు మండలంలోని కొలనుపాక, రామన్నపేట మండలంలోని రామన్నపేట, మోటకొండూరు మండలంలోని చాడ, ఆత్మకూరు మండలంలోని ఆత్మకూరు, భువనగిరి మండలంలోని అనాజీపూర్, అడ్డగూడూరు మండలంలోని అడ్డగూడూరు, పోచంపల్లి మండలంలోని భీమనపల్లి, మోత్కూరు మండలంలోని పాటిమట్ల, యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేట క్లస్టర్ పరిధిలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులతో సమావేశాలు నిర్వహించనున్నారు.

పూర్వ ప్రాథమిక విద్యకు
ప్రాధాన్యం ఇవ్వాలి

మహిళా శిశు సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కమిషనర్ వాకాటి కరుణ, పాల్గొన్న కలెక్టర్ తదితరులు

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 25: అంగన్‌వాడీల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య అందించాలని మహిళా శిశు సంక్షేమ, వయోవృద్ధుల శాఖ రాష్ట్ర కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ పిల్లల కోసం కొత్త పుస్తకాలు అందజేస్తామన్నారు. పోషకాహార లోపంపై నివేదికలు అందించాలన్నారు. దత్తతకు సంబంధించి కొత్త మార్గదర్శకాల ప్రకారం నివేదికలు సిద్ధం చేసి వెబ్‌సైట్‌లో పొందుపర్చాలన్నారు. పిల్లలు, వృద్ధులు, దివ్యాంగుల వసతి గృహాలు లేని చోట స్థల పరిశీలన చేసి ప్రతిపాదనలు పంపాలన్నారు. ట్రాన్స్‌జెండర్లకు ఐడీ కార్డులు అందజేయాలని తెలిపారు.

దివ్యాంగులకు సదరం క్యాంపులు నిర్వహించి అర్హులకు ధ్రువపత్రాలు అందజేయాలన్నారు. కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ మాట్లాడుతూ, జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యాబోధనకు ప్రాధాన్యం, పిల్లలకు నాణ్యమైన పోషక ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖపై త్వరలో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక, డీడబ్ల్యూవో జ్యోతిపద్మ, సీడీపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

కోదాడ రూరల్, కోదాడ, చిలుకూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. జనరల్ వార్డు, ఎక్స్‌రే రూమ్, ప్రయోగశాలను పరిశీలించి ఎన్ని నమూనాలు సేకరిస్తున్నారో ఆరా తీశారు. ఫార్మసీ కేంద్రంలో మందులు, వ్యాక్సిన్స్ స్టాక్ వివరాలు తనిఖీచేశారు. డయాలసిస్ యూనిట్‌ను పరిశీలించారు. ప్రసూతి వార్డులో తొగర్రాయి గ్రామానికి చెందిన కొండపల్లి దీపిక, గుండ్రాల గ్రామానికి చెందిన మాగి మేరీని వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కలెక్టర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. సాలార్జంగ్ పేట, తమ్మరబండపాలెంలో ఈద్గా, షాదీఖానాల నిర్మాణాల కోసం ప్రభుత్వ భూమిని పరిశీలించారు. చిలుకూరు మండలంలోని సీతారాంపురం గుట్టల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని పరిశీలించారు. స్కూల్ నిర్మాణం కోసం 20 ఎకరాల భూమి అవసరం కాగా, అందుకు అనువైన స్థలం కోసం ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ దశరథ్, మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్లు సాయిగౌడ్, ధృవకుమార్, హెచ్‌ఎం సలీంషరీఫ్, అల్తాఫ్ హుస్సేన్, బషీర్, ఆర్‌ఐ సీతారామచందర్‌రావు, సర్వేయర్లు కనకారావు, నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.



కోదాడ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నందాలాల్ పవార్

ఎంపీల ప్రమాణ స్వీకారం



ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న రఘువీర్‌రెడ్డి

పార్లమెంటు సభ్యులుగా ఉమ్మడి జిల్లాకు చెందిన రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలోని లోక్‌సభ హాల్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం పార్లమెంట్ హాల్ బయట సీఎం రేవంత్‌రెడ్డిని, తన తండ్రి జానారెడ్డి సహా మర్యాదపూర్వకంగా కలిశారు.

- నల్లగొండ



పార్లమెంట్ భవనం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి తదితరులు



ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

రాత్రి వేళల్లో ఆకతాయిలను కట్టడి చేయాలి

ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటక్రైం, జూన్ 25: పట్టణ పరిధిలో అక్రమ కార్యకలాపాలు, అక్రమ వ్యాపారాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, రాత్రి వేళ ఆకతాయిలను కట్టడి చేయాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి ఆయన మాట్లాడారు. గంజాయి వినియోగించే వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాలని, నిత్యం తనిఖీలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలు పెంచి నేరాలకు అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలను కవర్ చేయాలన్నారు. కేసులు పెండింగ్‌లో ఉండకుండా పనిచేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రవి, పట్టణ ఎస్‌ఐలు కుశలవ, లోకేష్, బాలకృష్ణ, మహేందర్‌నాథ్, తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ జిల్లా ప్రధాన న్యాయాధికారి గోవర్ధన్‌రెడ్డిని కోర్టు ఆవరణలో, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌ను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రైతులకు పెద్దపీట వేసేందుకు రుణమాఫీ

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పెన్‌పహాడ్ రైతు వేదికలో టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేడీఏ శ్రీధర్‌రెడ్డి, రైతులు

పెన్‌పహాడ్, జూన్ 25: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసేందుకు రుణమాఫీ చేస్తోందని, రైతులకు పూర్తి భరోసా ఇచ్చేలా నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో మంత్రి ముఖాముఖి మాట్లాడారు. రైతు భరోసా కోసం రుణమాఫీ పథకాన్ని చేపడుతున్న తరుణంలో రైతులు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. వాటిని ప్రభుత్వానికి మెయిల్ ద్వారా పంపాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, ఏవో కృష్ణసందీప్, సంధ్య, రైతులు ఓరుగొండ రాధాకృష్ణ, రంగినేని లక్ష్మీకాంతారావు, విజయ్‌కుమార్, మోహన్‌రావు, జలేందర్, మాధవరావు, నగేష్, దుర్గయ్య, మహబూబ్‌అలీ, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

మీలా జీవితం ఆదర్శనీయం



మీలా సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మీలా మహదేవ్, వాసుదేవ్, తదితరులు

సూర్యాపేటటౌన్, జూన్ 25: వ్యాపారవేత్త, సుధాకర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత మీలా సత్యనారాయణ జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శనీయమని సుధాకర్ పీవీసీ మేనేజింగ్ డైరెక్టర్లు మీలా మహదేవ్, మీలా వాసుదేవ్, మీలాజయదేవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మీలా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆసియాఖండంలోనే అతిపెద్ద సుధాకర్ పీవీసీ పైపుల కంపెనీ ఏర్పాటు చేసి ఎందరికో ఉపాధి కల్పించారని కొనియాడారు. పారిశ్రామిక రంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తూ సుధాకర్ పీవీసీని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. వ్యాపార రంగంలోనే కాకుండా సామాజిక, రాజకీయ, సేవా రంగాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్న గొప్పవ్యక్తి సత్యనారాయణ అని, ఆయన ఆశయాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, సుధాకర్ పీవీసీ ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా మీలా సత్యనారాయణ వర్ధంతి జిల్లా కేంద్రంలోని సుధాబ్యాంక్ ఆడిటోరియంలో సుధాబ్యాంక్ పాలకవర్గం నిర్వహించింది. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ మీలామహదేవ్, మీలా వాసుదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్, నాయకులు పెద్దిరెడ్డిరాజా, బ్యాంకు డైరెక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంబీ రికార్డు లేకుండా
అడ్వాన్స్ ఎలా చెల్లిస్తారు?

అధికారులపై అదనపు కలెక్టర్ ప్రియాంక ఆగ్రహం •8లో..

అప్పు తీర్చుకునేందుకు నకిలీ బంగారం తాకట్టు

● అప్రైజర్ సహకారంతో రూ.53.89లక్షల రుణం ● సహకరించిన బంధువులు ● ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

హుజూర్‌నగర్, జూన్ 25: నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.53 లక్షలు అప్పుగా తీసుకున్న కేసులో ఎనిమిది మంది నిందితులను సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం రాత్రి హుజూర్‌నగర్ పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ చరమందరాజు తెలిపారు. నేరేడుచర్ల మండలం వైకుంఠపురానికి చెందిన కేశవరపు రాజేష్ నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బంగారం వ్యాపారంలో నష్టాలతో అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చుకునేందుకు నకిలీ బంగారాన్ని తీసుకువచ్చి బ్యాంక్‌లో తాకట్టు పెట్టేలా కుట్ర పన్నాడు. ఇందుకోసం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో అప్రైజర్‌గా పనిచేస్తున్న జిల్లేపల్లి నరేందర్‌ను ఒప్పించాడు. తీసుకున్న అప్పులో కొంత ఇస్తానని నరేందర్‌తో మాట్లాడుకున్నాడు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలి, నెల్లూరు జిల్లాల నుంచి నకిలీ బంగారం గొలుసు తయారుచేయించి అనుమానం రాకుండా కేడీఎం16 హాల్‌మార్క్ ముద్ర వేయించాడు. అప్రైజర్ నరేందర్‌తో ఉన్న పరిచయంతో రాజేష్ రుణం మంజూరు కోసం బ్యాంక్‌ను ఆశ్రయించాడు. స్నేహితులు, బంధువుల పేరు మీద కిలో బంగారం తాకట్టు పెట్టి ఏడాది కిందట బ్యాంకు నుంచి రూ.53,89,000లు రుణంగా పొందారు.

బ్యాంక్ మేనేజర్‌కు అనుమానం వచ్చి..

రాజేష్ తన పేరుతో పాటు వైకుంఠపురానికి చెందిన కేశవరపు వర్షిత, చింతకుంట్ల గ్రామానికి చెందిన కొమెరపూడి వెంకటాచారి, వైకుంఠపురానికి చెందిన కణితి సాయిరాం, మాడ్గులపల్లి మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన యర్రగొర్ల పరశురాం, మిర్యాలగూడ పట్టణానికి చెందిన దోసేటి ముఖేష్, సూర్యాపేటకు చెందిన మోతుక్కూరి సూర్య పేరు మీద బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నాడు. ఈ క్రమంలో బ్యాంకు అధికారులు ఆడిట్ చేశారు. బంగారం పెట్టి ఏడాది గడుస్తున్నా రాజేష్ బంగారాన్ని విడిపించకపోవడంతో బ్యాంకు మేనేజర్ మేడబోయిన శ్రీకాంత్‌కు అనుమానం వచ్చి ఆయన తాకట్టు పెట్టిన బంగారాన్ని మరోసారి తనిఖీ చేయించాడు. దీంతో బంగారం నకిలీగా తేలడంతో గరిడేపల్లి పోలీసులను ఆశ్రయించాడు. గరిడేపల్లి ఎస్ఐ సైదులు విచారణలో బ్యాంకులో పనిచేస్తున్న అప్రైజర్ నరేందర్‌తో కలసి నకిలీ బంగారం తాకట్టు పెట్టినట్లు గుర్తించారు. నరేందర్‌తో పాటు రాజేష్‌కు సహకరించిన ఆరుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన గరిడేపల్లి పోలీసులను సీఐ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

విద్యుదాఘాతంతో గేదె మృతి

సూర్యాపేటరూరల్, జూన్ 25: విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలంలోని రత్నాపురం గ్రామంలో మంగళవారం జరిగింది. బాధితురాలు రాచకొండ సంధ్య తెలిపిన వివరాల ప్రకారం... రోజు మాదిరిగానే గేదెను మేత మేపేందుకు విడిచిపెట్టామని మేత మేసిన అనంతరం రత్నాపురం పల్లె చెరువులో నీళ్లు తాగుతుండగా స్తంభానికి ఉన్న సర్వీస్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

భూదాన్‌పోచంపల్లి, జూన్ 25: యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పో చంపల్లి మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ(ఎస్ఆర్‌టీఆర్ఐ)లో తెలంగాణ ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'మేధా చారిటబుల్ ట్రస్ట్' సహకారంతో తెలుగు రాష్ట్రాల్లోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ, హాస్టల్, భోజన వసతితో పాటు ఉద్యోగ, ఉపాధి ఆధారిత శిక్షణా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మీ తెలిపారు. ఎస్ఆర్‌టీఆర్ఐ ప్రధాన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆరు నెలల కాలవ్యవధితో నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్) సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్, సర్వీస్ కోర్సుకు ఐటీఐ/డిప్లొమా పాస్ అయిన వారు అర్హులని తెలిపారు. ఆరు నెలల కాలపరిమితితో నిర్వహించే కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీటీవీ టెక్నీషియన్ కోర్సుకు పదో తరగతి పాస్ అయిన వారు అర్హులని తెలిపారు. ఆరు నెలల కాలపరిమితితో నిర్వహిస్తున్న టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి, క్విల్ట్ బ్యాగ్స్ మేకింగ్ కోర్సులకు 8వ తరగతి పాస్ అయినవారు అర్హులని తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ కోర్సులకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. అర్హత గల ఒరిజనల్ సర్టిఫికేట్స్, జీరాక్స్ సెట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఆధార్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికేట్ జతపరిచి సంస్థ కార్యాలయంలో జూలై 1న ఉదయం 10 గంటల వరకు అందజేసి హాజరు కావాలని కోరారు.

సూపర్ మార్కెట్‌లో
కుళ్లిన కోడిగుడ్ల విక్రయం

భూదాన్‌పోచంపల్లి, జూన్ 25: ఓ సూపర్ మార్కెట్‌లో కుళ్లిన కోడిగుడ్లను విక్రయించి వినియోగదారులను మోసగిస్తున్నారని యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కీర్తి సంజీవ ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ఓ షాపింగ్ మాల్‌లో 30కోడిగుడ్ల(ట్రే)ను రూ.150 కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి గుడ్డును పరిశీలించి చూస్తే అవి ఏమాత్రం వాసన లేదని, వైట్, ఎల్లో లేకుండా పూర్తిగా ఆరెంజ్ రంగులో నీరులా ఉందని గమనించి, సూపర్ మార్కెట్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని తెలిపాడు. సూపర్ మార్కెట్ ఎదుట ఆందోళనకు దిగితే దాడికి యత్నించారని కీర్తి సంజీవ ఆవేదన వ్యక్తం చేశాడు. సూపర్ మార్కెట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

మహిళకు రూ.50 వేల జరిమానా

సంస్థాన్ నారాయణపురం, జూన్ 25: బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన మహిళకు రూ.50వేల జరిమానా విధించినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బాలోజీనాయక్ తెలిపారు. వెంకంభాయితండాకు చెందిన కరెంటోతు మగ్రు నాటుసారాతయారీ,విక్రయం విషయమై నిబంధనలు అతిక్రమించిందన్నారు. మగ్రుకు రూ.50వేల జరిమానా విధించి వసూలుచేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఎర్రపహాడ్‌లో చోరీ బంగారం అపహరణ

నూతనకల్, జూన్ 25 : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో చోరీ జరిగింది. సోమవారం అర్థరాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆ గ్రామానికి చెందిన కొంద్ర మల్లారెడ్డి దంపతులు తమ ఇంటి ముందు నిద్రిస్తున్నారు. అర్థరాత్రి దొంగలు గేటు దూకి లోపలికి వెళ్లి నిద్రిస్తున్న మల్లారెడ్డి సతీమణి శోభ మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడును దొంగలు ఎత్తుకెళ్లారు. వెంటనే లేచిన భర్త కేకలు వేయడంతో చుట్టు ప్రక్కల వారు లేవడంతో దొంగలు పారిపోయారు.

మండల కేంద్రంలోని భారత్ పెట్రోలియం బంక్ ముందు, చిన్ననెమిల క్రాస్ రోడ్ వద్ద ఉన్న బంక్ వద్ద ఆపి ఉన్న లారీల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్‌ను దొంగలు క్యాన్లలో దొంగిలిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. సంఘటనా స్థలాలను తుంగతుర్తి సీఐ శ్రీనివాస్‌నాయక్, ఎస్ఐ సైదులు పరిశీలించారు. ఆయా సంఘటనలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ

భువనగిరి టౌన్, జూన్ 25 : ఇంటిలో ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి దుండగుడు నాలుగు తులాల బంగారు గొలుసును అపహరించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో మంగళవారం వెలుగుచూసింది. కసరబోయిన లక్ష్మమ్మ తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మమ్మ ఒంటరిగా తన ఇంటిలో నివసిస్తోంది. భర్త చనిపోగా ఆమె ఏకైక కుమార్తె వివాహం అనంతరం బీబీనగర్‌లో నివాసముంటోంది. ఈ నేపథ్యంలో ఒంటరిగా ఉంటున్న ఆమె సోమవారం రాత్రి ఇంటిలో పడుకోగా అర్థరాత్రి ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు ఆమె మెడలోని రూ. 2.90 లక్షల విలువైన రెండు వరుసల బంగారు గొలుసును మెడలో నుంచి లాగే ప్రయత్నం చేయగా ఆమె అరుస్తూ ప్రతిఘటించడంతో దుండగుడు ఆమె ముఖంపై మెత్తతో అదిమిపెట్టి బంగారు గొలుసును అపహరించుకొని పారిపోయాడు. ఆమె కేకలు వేయడంతో వచ్చిన స్థానికులు పరిసరాలలో వెతికినా ఆచూకీ లభించలేదు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పట్టణఇన్‌సెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. అయితే రెండు వారాల క్రితం కూడా భువనగిరి గంజి ప్రాంతంలోని సొంత ఇంటిలో నిదిస్తున్న ఒంటరి మహిళను నిద్రలేపి ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించిన ఘటన విధితమే. అయితే ఆ కేసులో నిందితుల్ని అరెస్టు చేసినట్టు పోలీసులు చెబుతున్నప్పటికీ స్వల్ప వ్యవధిలో ఇద్దరు ఒంటరి మహిళలు లక్ష్యంగా వాళ్ల ఇళ్లలోనే వారి మెడలో నుంచి బంగారు గొలుసులను అపరించక పోయిన ఘటనలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల నిరవధిక సమ్మె



నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

నల్లగొండ టౌన్, జూన్ 24: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా మంగళవారం కూడా జూనియర్ డాక్టర్లు అత్యవసర సేవలను మినహాయించి ఓపీ, ఇతర సేవలను బహిష్కరించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో బైఠాయించడంతో పాటు ఆవరణలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కె.అబ్దుల్ సమద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ గగన్ పెరుమాళ్ల మాట్లాడుతూ జూనియర్ డాక్టర్లకు చెల్లిస్తున్న ఉపకార వేతనాన్ని నెల నెలా చెల్లించాలని, మెడికల్ కళాశాలలో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రుత్విక, సత్యసాయికృష్ణ, రేవంత్, జాన్వీ, బాలు వేమిరెడ్డి, శ్రీనిధి, హరీష, రషీద, దీపిక, శ్రీవల్లి, భరత్, మమత, ఇంద్రాణి, దినేష్ , శివకుమార్, సంతోష్ బాబు, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు ఫీజులో రాయితీ



జర్నలిస్టు సంఘాల నాయకులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న డీఈవో

నల్లగొండ టౌన్, జూన్ 25 : జిల్లాలో వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీనిస్తూ నల్లగొండ జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం బిక్షపతి ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖఅధికారి ప్రొసీడింగ్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో డీఈవో కార్యాలయంలో డీఈయుడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులకు డీఈవో ప్రొసీడింగ్ కాపీని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వడం కోసం నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇవ్వాలని పాఠశాలల యాజమాన్యానికి సూచించారు. అనంతరం టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఫీజులో రాయితీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ విజ్ఞప్తి మేరకు కలెక్టర్‌తో పాటు డీఈవో స్పందించి వారం రోజుల్లోనే ప్రొసీడింగ్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పులిమామిడి మహేందర్‌రెడ్డి, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల రామకృష్ణ, రాష్ట్ర జిల్లా నాయకులు అబ్బోజు మదనాచారి, పొట్టుముత్తు అశోక్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా

● పంతంగి టోల్‌గేట్ వద్ద 300 కిలోలు పట్టివేత?

చౌటుప్పల్ రూరల్, జూన్ 25: గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముఠా సభ్యులను యాదాద్రిభువనగిరి జిల్లా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌గేట్ వద్ద వీరిని అరెస్టు చేసి 300కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం నుంచి హైదరాబాద్‌కు ఇన్నోవా కారులో గంజాయి తరలిస్తుండగా సమాచారం అందుకున్న రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఎస్‌వోటీ పోలీసులు చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి నుంచి సుమారు 300కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇన్నోవా వాహనం, ఎస్కార్ట్‌గా ఉన్న షిఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలు బుధవారం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరి బలవన్మరణం



లింగయ్య(ఫైల్)

అర్వపల్లి, జూన్ 25 : అప్పుల బాధతో క్రిమిసంహారక మందు తాగి చిరువ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ యాకూబ్, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన కట్టెల లింగయ్య(45) టిఫిన్ బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణకు లింగయ్యకు రూ.5 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పు తీర్చమని అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 24న అర్వపల్లి పల్లె ప్రకృతి వనం వద్ద సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు 108 వాహనంలో సూర్యాపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. లింగయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లింగయ్య భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాకుబ్ తెలిపారు. కాగా నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం అగ్రహారం గ్రామంలో మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తయ్యాయి.

ఈదులూరులో డీసీఎం డ్రైవర్

కట్టంగూరు : ఆర్థిక ఇబ్బందులతో డీసీఎం డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ఈదులూరు గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా సైదాపూర్ గ్రామానికి చెందిన రాపోలు మురళీ(39)కి మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన రజితతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. బతుకుదెరువు కోసం అత్తగారి ఊరు ఈదులూరులో ఉంటూ డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. మంగళవారం భార్యాపిల్లలు గ్రామంలో పని నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మురళీ ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన భార్య గమనించి పోలీసులకు సమాచారం అందించింది. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. లింగయ్యకు భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఫ్లైఓవర్‌తో ప్రమాదాలకు చెక్

● హైదరాబాద్-విజయవాడ హైవేపై చౌటుప్పల్, చిట్యాలలో నిర్మాణం

● త్వరలో పనులు ప్రారంభం



చౌటుప్పల్‌లో హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై ఫ్లైఓవర్ నిర్మించే ప్రాంతం

చౌటుప్పల్ టౌన్, జూన్ 25 : నిత్యం నెత్తురోడుతున్న రహదారిపై ప్రమాదాలకు చెక్‌పడనుంది. హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి(65)పై యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో రెండు కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నెల రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం జాతీయ రహదారుల సంస్థ(నాయ్) సన్నాహాలు చేస్తోంది. ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రంప్రభుత్వం రూ.82కోట్లు మంజూరు చేయడంతో పాటు టెండర్ ప్రక్రియను పూర్తిచేసింది. పట్టణంలో సర్వీస్ రోడ్ల పనులతో పాటు మరమ్మతులు పూర్తికాగానే ఫ్లైఓవర్ పనులను చేపట్టే అవకాశాలు ఉన్నాయి. మట్టి పరీక్షలు కూడా అనుకూలంగా రావడంతో పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో పదేళ్ల స్థానికుల కల నెరవేరనుంది. అదేవిధంగా కొన్నేళ్లుగా జరుగుతున్న ప్రమాదాలకూ చెక్‌పడనుంది.

హైవేపై రద్దీతో ఇబ్బందులు

హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై వాహనాల రాకపోకలు గత దశాబ్దకాలంలో విపరీతంగా పెరిగాయి. దీంతో ప్రమాదాలు జరుగుతుండటం, పాదాచారులు రోడ్డు దాటేందుకు నానా ఇబ్బందులు పడుతుండటం వంటి సంఘటనలూ నిత్యకృత్యంగా మారాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్, తంగడపల్లి రోడ్డు, వలిగొండ అడ్డరోడ్డు జంక్షన్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఈ నేపథ్యంలో రాకపోకలను సుగమం చేసేందుకు గతంలో భువనగిరి, ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి రెండుళ్లుగా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఒప్పించి రూ.82 కోట్లు మంజూరు చేయించారు. ఈ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. మరో నెల రోజుల్లో పనులను ప్రారంభించేందుకు నాయ్ అవసరమైన ఏర్పాట్లను చేస్తోంది.

సర్వీస్ రోడ్లు సిద్ధమయ్యాకే..

మొదటగా పట్టణంలో అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులను చేపట్టారు. వారం రోజులుగా ఈ పనులు సాగుతున్నాయి. మూడేళ్ల కిందట చెరువు అలుగు పోయడంతో వరదకు ఒకపక్క సర్వీస్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ప్రస్తుతం రాకపోకలకు ఎంతో ఇబ్బందికరంగా మారింది. ఈ సర్వీస్ రోడ్డు మరమ్మతు పనులు సాగుతున్నాయి. సర్వీస్ రోడ్ల పనులు పూర్తి కాగానే ఫ్లైఓవర్ పనులను మొదలుపెట్టనున్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు సర్వీస్ రోడ్లలోని ఆక్రమణలను తొలగించనున్నారు.

12 ఏళ్ల కిందట హైవే నిర్మాణం..

చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ సమీపంలోని ఆందోళ్ మైసమ్మ దేవాలయం నుంచి కృష్ణా జిల్లా నందిగామ వరకు 182 కిలోమీటర్ల పొడవున జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిని నాలుగుదారుల(ఫోర్‌వే) రోడ్డుగా మార్చారు. 2008 నుంచి 2012 వరకు ఈ రోడ్డు నిర్మాణం జరిగింది. అయితే 2011లో స్థానికులు కేంద్ర ప్రభుతంపై ఒత్తిడి తెచ్చి అప్పట్లో ఫ్లైఓవర్ నిర్మాణాన్ని రద్దు చేయించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు పెరగడంతో ఫ్లైఓవర్ అంశం తెరపైకి వచ్చింది. 2009 నుంచి 2014వరకు భువనగిరి ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఫ్లైఓవర్ లేదా బైపాస్ రోడ్డు ఏర్పాటుపై పలు సందర్భాల్లో ప్రస్తావించారు.

రెండు కిలోమీటర్ల పొడవున ఫ్లైఓవర్

పట్టణంలోని ఎంపీపీ కార్యాలయానికి వెళ్లే దారి నుంచి పద్మావతి ఫంక్షన్‌హాల్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవున మట్టి కట్టతో ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. బస్‌స్టేషన్ వద్ద ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తారు. ఇక్కడ 20 మీటర్లకు ఒక పిల్లర్ వంతున 10పిల్లర్స్‌ను ఏర్పాటుచేస్తారు. ఈ పిల్లర్స్ మధ్య 200 మీటర్ల వెడల్పుతో ఉండే ఎలివేటెడ్ కారిడార్‌తో 10 దారుల వెంట వాహనాలు, పాదాచారుల రాకపోకలు సాగుతాయి. ఈ పిల్లర్స్‌పైన శ్లాబ్(సీసీ) నిర్మిస్తారు. రెండవది భాస్కర్ టాకీస్ సమీపంలో 16 మీటర్ల వెడల్పుతో పెడల్టర్ అండర్ పాస్(పీయూపీ) మూడవది వలిగొండ అడ్డరోడ్డు వద్ద 30 మీటర్ల వెడల్పుతో వెహికల్ అండర్ పాస్(వీయూపీ)లను నిర్మించనున్నారు.

మిషన్ భగీరథ పైలాన్ పార్క్ వద్ద

స్థానిక మిషన్ భగీరథ పైలాన్ పార్క్ వద్ద అండర్ పాస్ ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. వ్యాయామం కోసం ప్రజలు పార్క్‌కు వెళ్తుంటారని, దీనిని దృష్టిలో పెట్టుకొని చిన్న అండర్‌పాస్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

తప్పనున్న రాంగ్‌రూట్ కష్టాలు



ఫ్లైఓవర్ నిర్మించే చిట్యాలలోని జంక్షన్

చిట్యాల : నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణంతో ప్రజల కష్టాలు తీరనున్నాయి. అటు ప్రమాదాలతో పాటు రాంగ్‌రూట్‌తో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి. హైవేపై గుర్తించిన 17బ్లాక్‌స్పాట్లలో చిట్యాల పట్టణంలోని జంక్షన్ ఒకటి. జాతీయ రహదారి నిర్మాణ సమయంలోనే ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రతిపాదన ఉన్నా కొంతమంది వ్యతిరేకించడంతో ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాత జరిగిన ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులతో ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 23వ తేదీన ఫ్లైఓవర్ నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భూమి పూజ చేశారు. డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలనీ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రోడ్డు నిర్మాణంతో చిట్యాల పట్టణం ఉత్తర, దక్షిణ చిట్యాలగా విడిపోయింది. అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు వెళ్లడానికి తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు రోడ్డు దాటడానికి రాంగ్‌రూట్‌లో వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకపై ఈ సమస్యకు చెక్‌పడనుంది. సుమారు 800 మీటర్ల మేర రూ.40 కోట్ల వ్యయంతో బస్టాండ్ సమీపం నుంచి హైస్కూల్ సమీపం వరకు ఫ్లైఓవర్ నిర్మించనున్నట్లు సమాచారం.

రాంగ్‌రూట్ కష్టాలు తప్పుతాయి



చిట్యాలలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణంతో రోడ్డు దాటడానికి రాంగ్‌రూట్‌లో వెళ్లాల్సిన బాధ తప్పుతుంది. రాంగ్‌రూట్‌లో వెళుతూ ప్రమాదాల బారిన పడ్డారు. ఇప్పుడు ఆ బాధ తప్పుతుంది. ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేయాలి.

- ఏర్పుల పరమేశం, చిట్యాల పట్టణవాసి

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

భువనగిరి అర్బన్, జూన్ 25: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ప్రధానాలయంలోని స్వయంభూలను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి, ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.22,11,322 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారి సేవలో సీఎస్ శాంతికుమారి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి స్వామివారిని దర్శించుకున్నారు. ఆమెకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్ల పూజల్లో పాల్గొన్న అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈవో ఏ భాస్కర్‌రావు సీఎస్‌కు స్వామివారి చిత్రపటాన్ని, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.



స్వామిఅమ్మవార్లకు నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో భాస్కర్‌రావు

పోలీసుల అదుపులో నిందితుడు?

నాగార్జునసాగర్, జూన్ 25 : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఎలక్ట్రిషియన్ రెహమాన్ హత్యోదంతంలో నిందితుడు శివారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సాగర్ హిల్‌కాలనీలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న పాఠశాల భవన నిర్మాణ పనులను రెహమాన్ చేస్తున్నాడు. అతడిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందిన శివారెడ్డి పనిచేసే చోటే మాటామాటా పెరిగి కిరాతకంగా హత్య చేసి పాఠశాల ఆవరణలో పూడ్చివేసిన సంగతి తెలిసిందే. హత్య చేసిన అనంతరం పరారీలో శివారెడ్డిని మంగళవారం ఉదయం జహీరాబాద్ ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విచారణ అనంతరం బుధవారం మీడియా ముందు తీసుకురానున్నట్లు సమాచారం.

ఇసుక డంపు సీజ్

డిండి, జూన్ 25: అనుమతులులేకుండా డంపు చేసిన ఇసుకను నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. తహసీల్దార్ తిరుపతయ్య, ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రంలోని చెన్నకేశవ దేవాలయం వద్ద 25 ట్రక్కుల ఇసుకను శిగనంమెట్ల చిన్నరాములు నిలువ చేశాడు. ఇసుక డంప్‌ను సీజ్ చేసి రాములుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మోత్కూరు, జూన్ 25: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో మంగళవారం పోలీసులు పేకాటస్థావరంపై దాడి చేశారు. ఇందిరానగర్ సమీపంలోని అన్నెపు మురళీ ఇంట్లో పేకాటఆడుతున్న 12మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామని ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.27,040, ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.

విద్యుత్ లైన్‌మన్ సస్పెన్షన్

హుజూర్‌నగర్, చిలుకూరు, జూన్ 25: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం విద్యుత్ లైన్‌మన్ పసుపులేటి శ్రీనివాస్‌ను సస్పెండ్‌కు గురయ్యాడు. జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన వినియోగదారుడి నుంచి డబ్బులు తీసుకొని అనధరైజ్డ్ డిపార్ట్‌మెంట్ పనులు చేస్తున్నాడని ఆరోపణలురావడంతో అతడిపైన ఏడీఈ కోదాడ వెంకన్న క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పైఅధికారులకు నివేదిక అందజేయడంతో ఏడీఈ వెంకటకృష్ణయ్య లైన్‌మన్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈ వెంకటకృష్ణయ్య మంగళవారం తెలిపారు. శ్రీనివాస్‌పై గతంలో పలుఆరోపణలు వచ్చాయని, 10 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు మూడు, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రతిపాదనలు లేకుండానే మార్చి వాటికి సంబంధించిన డీపీ వర్క్, లైన్‌వర్క్ చేశారని, దాంతో పాటు కోళ్ల ఫాంకు ప్రతినెలా రీడింగ్ తీసి బిల్ ఇవ్వకుండా విద్యుత్ చౌర్యం జరుగుతున్నా పైఅధికారులకు తెలియకుండా సంస్థకు నష్టం కలిగించాడన్న పలు ఆరోపణలు రావడంతో శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈ తెలిపారు. ప్రతి వినియోగదారుడు ఏడీఈ ఆఫీసులో వినియోగదారుల సేవాకేంద్రంలో సమస్యలను తెలియపరిచి సత్వర న్యాయం పొందవచ్చని డీఈ తెలిపారు.

నగదు రెట్టింపు చేస్తామని మోసం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూన్ 25: నగదు రెట్టింపు చేస్తామని మాయమాటలు చెప్పి మోసం చేస్తున్న ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు నిందితులను అరెస్టుచేసి, వారినుంచి రూ.24లక్షల నగదు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నల్లగొండ మండలం చందనపల్లికి చెందిన ఆర్‌ఎంపీ శ్రీరామోజు రామాచారి ఇంటి నిర్మాణ సమయంలో బీహార్ రాష్ట్రానికి చెందిన తాపీ మేస్త్రి రామ్ నరేష్‌యాదవ్‌తో పరిచయం ఏర్పడింది. తన వద్ద నగదు రెట్టింపు చేసే లిక్విడ్(రంగు నీళ్ల) ఉన్నాయని చెప్పి నమ్మించాడు. మొదటి విడత రూ.6,500 నగదును అందులో ముంచి రెట్టింపు చేస్తున్నట్లుగా రూ.13వేలు ఇచ్చాడు. దీంతో నమ్మిన రామాచారి మరిన్ని డబ్బులు పోగుచేసి నరేష్‌యాదవ్‌కు సమాచారం ఇచ్చాడు. అతడు బీహార్‌లో వస్త్ర వ్యాపారం చేసే షేక్ సిరాజ్, షేక్ అఫ్తాబ్‌తో కలిసి ఈ నెల 22వ తేదీన రూ.33లక్షల నోట్లను బకెట్‌లో ముంచి బయటకు తీసి వాటికి తెలుపు, బ్రౌన్ కలర్ ప్లాస్టర్‌ను వేసి బండిల్ చేశారు. రూ.3లక్షల చొప్పున మొత్తం 11కట్టలుగా చేసి బకెట్‌లో వేసి స్టవ్‌పై వేడి చేసి ఒక రోజు తర్వాత తెరిస్తే రెట్టింపు అవుతాయని చెప్పారు. అనంతరం రామాచారి, కుటుంబ సభ్యులు పనిలో ఉండగా నకిలీ కాగితాలు అందులో పెట్టి అసలు నగదుతో వెళ్లిపోయారు. మరుసటి రోజు ఎవరూ రాకపోవడంతో బకెట్‌లో ఉన్న నగదును చూసి మోసపోయామని తెలుసుకున్న రామాచారి ఈ నెల 23వ తేదీన నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రామాచారి ఇచ్చిన ఫిర్యాదుమేరకు నల్లగొండ రూరల్ సీఐ డానియల్‌కుమార్, ఎస్‌ఐ శివకుమార్ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో సిబ్బందితో ముఠా కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బీహార్ వెళ్లే క్రమంలో ఈ నెల 24వ తేదీన నల్లగొండ రైల్వేస్టేషన్‌కు వచ్చిన షేక్ సిరాజ్, రామ్‌నరేష్‌యాదవ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులిద్దరూ నేరం అంగీకరించటంతో వారినుంచి రూ.24లక్షలు స్వాధీనం చేసుకున్నారు. రూ.9లక్షల నగదుతో పారిపోయిన షేక్ అఫ్తాబ్‌కోసం గాలిస్తున్నామని, త్వరలో పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన డీఎస్పీ శివరాంరెడ్డి, టూటౌన్ సీఐ డానియల్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

విద్యార్థినిపై వీధికుక్క దాడి

● పాఠశాల ఆవరణలో ఆడుకుంటుండగా ఘటన

భువనగిరి టౌన్, జూన్ 25: పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న విద్యార్థినిపై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పహాడినగర్‌కు చెందిన సమ్రీన్‌బేగం(11) ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయం(ఆటల పీరియడ్‌లో) తోటి విద్యార్థులతో కలిసి పాఠశాల మైదానంలో ఆడుకుంటోంది. ఇంతలో ఓ వీధికుక్క బాలికపై దాడి చేసింది. తప్పించుకునే క్రమంలో పరుగెడుతూ కింద పడటంతో ఆమె చేతులు, కాళ్లు, నుదుటిపై కరిచింది. దీంతో సమ్రీన్‌బేగం తీవ్రంగా గాయపడింది. అప్రమత్తమైన విద్యార్థులు, ఉపాధ్యాయులు కర్రలతో వీధికుక్కపై దాడి చేశారు. దీంతో కుక్క సమ్రీన్‌ను వదిలి పారిపోయింది. ఉపాధ్యాయులు వెంటనే విద్యార్థినిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నల్లకుంటలోని ప్రభుత్వఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది.



గాయపడ్డ విద్యార్థిని సమ్రీన్‌బేగం

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు, చెరువులో పడి ఒకరు మృతి చెందారు.

మిర్యాలగూడ అర్బన్, జూన్ 25 : రోడ్డుపైకి వచ్చిన గేదెలను బైక్‌తో ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామశివారులో మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. రూరల్‌ఎస్‌ఐ నరేష్ వివరాలు వెల్లడించారు. జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన పెయ్యల శ్రీను(49) వంటమనిషిగా పనిచేస్తున్నాడు. మిర్యాలగూడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వంట చేయడానికి మంగళవారం తెల్లవారుజామున బైక్‌పై బయలుదేరాడు. ఊరిబయటకు వచ్చేసరికి పాడిగేదెలు గుంపు రోడ్డుపై రావడంతో తప్పించే క్రమంలో ఓ గేదెను ఢీకొట్టి కిందపడిపోయాడు. దీంతో శ్రీను తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. శ్రీనుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


కొత్తగూడెం వద్ద కార్మికుడు

మిర్యాలగూడ అర్బన్: బోర్‌వెల్ లారీనుంచి ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు జారిపడి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం పరిధిలోని కొత్తగూడెం గ్రామం వద్ద సోమవారం జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలను రూరల్ ఎస్‌ఐ నరేష్ మంగళవారం తెలిపారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బస్తర్ జిల్లా జాంగూడ గ్రామానికి చెందిన బోటిరాం బాగల్(28) కొంతకాలంగా బోర్‌వెల్ లారీపై కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం లారీపై కూర్చుని వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ భాషపాక శంకరయ్య బోర్‌వెల్ లారీని అజాగ్రత్తగా నడిపడంతో ప్రమాదం జరిగినట్లుగా గుర్తించామని, మృతుడి సోదరుడు భువనేశ్వర్ బాగల్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

చెరువులో మృ

సూర్యాపేటరూరల్, జూన్ 25 : చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ బాలునాయక్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట మండలం యండ్లపల్లి గ్రామ శివారులో వెంకటాపురం చెరువులో స్థానికులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. సుమారు ఐదు, ఆరు రోజుల కిందట చెరువులో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహం గుర్తుపట్టకుండా ఉంది. మృతదేహం ఐదు అడుగుల ఎత్తు, తెలుపు రంగుపై నల్లడబ్బాలు, మెరిన్ రంగు ఫుల్ షర్టు, పింక్ కలర్ లాగు ధరించి ఉంది. ఆనవాళ్లు తెలిసిన వారు సూర్యాపేటరూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ బాలునాయక్ తెలిపారు.

రైల్వేస్టేషన్ సమీపంలో...



మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ రైల్వేస్టేషన్ గెస్ట్‌హౌస్ సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ నరేష్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నించగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడి వయసు సుమారు 55 సంవత్సరాల వరకు ఉండవచ్చని, బ్రౌన్‌కలర్ గీతలు కలిగిన షర్టు, నలుపురంగు నెక్కర్ ధరించి ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వృద్ధుడిగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రి మార్చురీగదిలో భద్రపరిచి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతుడిని గుర్తించినవారు 8712670189 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని రూరల్ ఎస్‌ఐ నరేష్ కోరారు.

కంబాలపల్లి అటవీ రేంజ్‌లో పెద్దపులులు, రాబందులు

● శ్రీశైలం అటవీ ప్రాంతం వైపు నుంచి రాక...

● సీసీ కెమెరాల్లో నమోదైన జంతువులు, పక్షులు

దేవరకొండ, జూన్ 25: నల్లమల అటవీ ప్రాంతం అభివృద్ధికి ఆ శాఖ చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నాగార్జునసాగర్ డివిజన్ చందంపేట మండలం కంబాలపల్లి రేంజ్‌లో నల్లమల అటవీ ప్రాంతంలో రెండు పెద్దపులులు, రాబందులు సంచరిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి నల్లగొండ, కర్నూలు జిల్లాల్లో 26,795 హెక్టార్ల వరకు విస్తరించి ఉంది. కంబాలపల్లి రేంజ్‌లో రెండు పెద్దపులులు, రాబందులు సంచరించడం ఇదే మొదటిసారని డివిజన్ అధికారి సర్వేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. తాము ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో వన్యప్రాణులు సంచరించిన దృశ్యాలను నమోదయ్యాయన్నారు. చందంపేట మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో చిరుత పులులతో పాటు వన్యప్రాణుల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. అటవీ జంతువుల సంరక్షణకు కేంద్రప్రభుత్వం రూ.4.50కోట్లు విడుదల చేయగా ఆ నిధులతో అటవీశాఖ నల్లమల అటవీ ప్రాంతంలో పలు అభివృద్ధి పనులు చేపట్టింది. అటవీ అభివృద్ధి, వన నర్సరీలు, రోడ్లు, చెక్‌డ్యాంలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు 50కి పైగా సీసీ కెమెరాలతో నిఘా, వాచ్‌టవర్, బేస్‌క్యాంపులు ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతం చుట్టూ ఇనుపగేట్లు, కంచె ఏర్పాటు చేశారు. వన్యప్రాణులతో పాటు అటవీ జంతువుల దాహార్తిని తీర్చుకునేందుకు నల్లమలలో 150 కిపైగా నీటితొట్లు, చెక్‌డ్యాంలు ఏర్పాటు చేశారు.

దీంతో నల్లమలలో అటవీ జంతువుల సంఖ్య పెరిగినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే నల్లమలలో 45కు పైగా చిరుత పులులు, ఎలుగుబంట్లు, రేస్ కుక్కలు, మనుబోతులు, దుప్పులు, జింకలు, కొండెంగలు, నెమళ్లు, అడవి పందులు, కుందేళ్లు వేలసంఖ్యలో ఉన్నాయని, వాటిసంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శ్రీశైలం అటవీ ప్రాంతం వైపు నుంచి వచ్చిన రెండు పెద్దపులులు కంబాలపల్లి రేంజ్‌లో కనిపించడం చాలా సంతోషంగా ఉందన్నారు.



నల్లమల్ల అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న అరుదైన పక్షి రాబందు(రౌండప్‌లో)

'ఉపాధి' భారమై..వలస బాటలో

● బతుకుదెరువు కోసం సన్నకారు రైతులు, కూలీల వలస బాట ● సమీపంలో నీళ్లున్నా ఉపయోగం శూన్యం



నాగులపాటిఅన్నారం గ్రామం నుంచి ఇతర జిల్లాలకు వలస వెళుతున్న కూలీలు(ఫైల్)

పెన్‌పహాడ్, జూన్ 25: మండలంలో కరువు తీవ్ర రూపం దాల్చింది. మండలం మీదుగా సాగర్ ఎడమ కాలువ వెళుతున్నప్పటికీ మూడేళ్లుగా నీటిని విడుదల చేయలేదు. దీంతో రైతులు సాగు నీటి కోసం తమ పొలాల్లో విచ్చలవిడిగా బోర్లు వేశారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్ల నుంచి చుక్క నీరు కూడా రావడంలేదు. దీంతో సన్నకారు రైతులతో పాటు, పనులు దొరకక కూలీలు కూడా వలస బాట పట్టారు. రెండేళ్ల నుంచి మండలంలో ఇదే పరిస్థితి నెలకొంది.

పెన్‌పహాడ్ మండలంలో 29గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ముఖ్యంగా నాగులపాటిఅన్నారం, నాగులపహాడ్, అనాజీపురం, పొట్లపహాడ్, అనంతారం, అన్నారంబ్రిడ్జి, ధర్మాపురం, భక్తాళాపురం, చెట్లముకుందాపురం, చీదెళ్ల, మాచారం, పెన్‌పహాడ్ గ్రామాల్లో సాగునీరు లేక వ్యవసాయ పనులు మందగించాయి. దీంతో పనులు దొరక్క ఒక్కో గ్రామంలో 20మంది నుంచి 60మంది వరకు వ్యవసాయ కూలీలతో పాటు ఆర్థిక సమస్యలతో సన్నకారు రైతులూ వలస బాట పట్టారు. . గిరిజన తండాల నుంచి కూలి పనుల కోసం హైదరాబాద్, నిజామాబాద్, ఏపీ రాష్ట్రం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు వలస వెళుతున్నారు. నాగులపాటి అన్నారం గ్రామం నుంచి కూలీలు వరి నాటు వేయడానికి భూదాన్‌పోచంపల్లికి వలసవెళ్లారు. ఈ పనులు పూర్తయిన తర్వాత మిరప కోతలకు ఏపీ రాష్ట్రం వెళ్లనున్నారు.

సాగు నీటితో పాటు, భూగర్భ జలాలు అడుగంటినందున రైతులు ఆందోళనతో ఉన్నారు. పొలాలు బీడుగా మారడంతో కూలీలతో పాటు రైతులు గత ఏడాది కూడా వలస వెళ్లారు. పాలకులు మారుతున్నా తమ తలరాతలు మారడంలేదని సన్నకారు రైతులు, కూలీలు కన్నీరుమున్నీరవుతున్నారు. బతుకుదెరువు కోసం పక్క జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఎడమ కాల్వకు సక్రమంగా నీటిని విడుదల చేయాలని, భూగర్భ జల మట్టం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికంగా 'ఉపాధి' పనులు కల్పించాలని, కూలీలు కోరుతున్నారు.

వ్యవసాయం చేయలేకపోతున్నాం



నాకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నాగార్జునసాగర్ కాలువ నీరు రావడంలేదు. రెండు ఎకరాల్లో మూడు బోర్లు వేసినా ఎండిపోయాయి. దీంతో రెండేళ్లుగా పంటలేక బీడుగా మారింది. గత్యంతరం లేక బతుకుదెరువు కోసం కుటుంబ సభ్యులతో కలిసి వలస వెళ్లాం.

\- మేడం వెంకటయ్య, నాగులపాటిఅన్నారం గ్రామం

ఆగని చోరీలు..ఆందోళనలో రైతులు



రఘునాథపాలెంలో దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

మఠంపల్లి: రైతులు సొంత ఖర్చులతో పంట పొలాల్లో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ మోటార్లు వరుసగా చోరీ అవుతున్నాయి. ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేసుకుంటున్న రైతులు కాలం కలిసి రాక ప్రతిఏటా ఏదో విధంగా నష్టపోతున్నారు. మరో వైపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ మోటార్లు చోరీకి గురవుతున్నందున ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల వ్యవధిలో మండలంలోని నాలుగు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లను దొంగలు చోరీ చేశారు. దీంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ చోరీలు రైతుల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నాం

విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను రైతులు ఎప్పటికప్పుడు సమాచాచం ఇస్తున్నారు. ఈ ఉదంతాలపై ఎప్పటికప్పుడు పోలీసులు ఫిర్యాదు చేస్తున్నాం. . నిబంధనల ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారని రైతులు ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తేనే, ఆ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది మంజూరు చేయడానికి ఆస్కారం ఉంది.

● హరీ‌ష్‌రెడ్డి, విద్యుత్ ఏఈ

రెండు నెలల్లో 17చోట్ల చోరీలు

మఠంపల్లి మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లలో విలువైన రాగి తీగతో పాటు వి ద్యుత్ మోటర్లను చోరీ చేసే ముఠాలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. మే, జూన్ నెలల్లో ఇప్పటివరకు 5హెచ్‌పీ, 7హెచ్‌పీ వ్యవసాయ మోటార్లు పది, 16కేవీఏ, 25కేవీఏ, 63కేవీఏ సామర్థ్యం ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి తీగ, విలువైన సామగ్రిని చోరీ చేశారు. యాతవాకిళ్ల గ్రామంలో ఇటీవల ఒకే రోజు తొమ్మిది, మఠంపల్లి, దొనబండతండా, రఘునాథపాలెం గ్రామంలో ఎనిమిది మోటర్లను దొంగలు చోరీ చేశారు.

10రోజుల క్రితం రఘునాథపాలెం గ్రామంలో వెన్న పెద భద్రారెడ్డి, ముల్లంగి నర్సిరెడ్డి, బొగ్గుల దస్తగిరి, షేక్ ఖుదాన్, బత్తుల శ్రీనులకు చెందిన ఐదు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి వాటిలో ఉన్న సుమారు రూ.4లక్షల విలువైన రాగి తీగను దొంగిలించారు. ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేశారని, వ్యవసాయ మోటర్లు చోరీ చేశారని విద్యుత్ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదుచేయడంలేదని, రైతులకు కొత్త ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేయడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. పంటలను సాగు చేయాలంటే విద్యుత్ టాన్స్‌ఫార్మర్లు,విద్యుత్ మోటర్లు లేక ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తున్నారని రైతులు ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేస్తున్నాం. దొంగల ముఠాను పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

● రామాంజనేయులు, ఎస్ఐ, మఠంపల్లి

ఎంబీ రికార్డు లేకుండా అడ్వాన్సు ఎలా చెల్లించారు?



మోతెలోని ప్రాథమిక పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

మోతె, జూన్ 25: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను ఎంబీ రికార్డులు చేయకుండా రూ.10లక్షల పైబడి అడ్వాన్సు ఎలా చెల్లించారని మండల ఇన్‌చార్జి ఎంపీడీవో హరిసింగ్‌నాయక్, ఐబీ ఏఈ లింగయ్యలపై అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మోతె మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల రికార్డులను పరిశీలించారు. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలలకు 24 ఎంపికయ్యాయని, ఈ పాఠశాలల్లో మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీలు, విద్యుత్ సౌకర్యం వంటి పనులకు ఒక్కో పాఠశాలకు రూ.లక్ష పైబడి నిధులు మంజూరు చేశామన్నారు. ఈ పనులను వేసవి సెలవులకు ముందే ప్రారంభించినా నేటికీ పూర్తి చేయలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.10ల పనులకు కూడా నేటికీఎంబీ రికార్డు చేయలేదన్నారు. అడ్వాన్సుల చెల్లింపులపై పూర్తి స్థాయి పనుల వివరాలను, ఎంబీ రికార్డులను మూడు రోజుల్లో కార్యాలయంలో అందజేయాలని, రికార్డుల నమోదులో ఏవిధమైన అక్రమాలు జరిగినా ఎంపీడీవో, ఏఈలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 25: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. పీసీ పీఎన్‌డీటీ, ఎంటీపీ చట్టాలపై నిర్వహించిన మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మతో కలిసి ఆమె మాట్లాడారు. గర్భిణులకు స్కానింగ్ చేయడం బిడ్డ ఎదుగుదలను తెలుసుకోవడానికేనని, కడుపులోని బిడ్డ జెండర్ తెలుసుకోవడానికి కాదన్నారు. కడుపులో ఆడ బిడ్డ ఉందని తెలుసుకుని చంపేయడం నేరమన్నారు. పీసీపీఎన్‌డీటీ, ఎంటీపీ చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిపించేలా అంగన్‌వాడీ, మెడికల్ హెల్త్ డిపార్ట్‌మెంట్, మెడికల్ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయ, అంజయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: ఏఐకేఎంఎస్

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 25: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అరికట్టి రైతులను ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అద్యక్షుడు వి.కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,70,530 మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, రుణాలు తక్షణమే అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, మేకల కనకరావు, శ్రీనివాస్ రెడ్డి, గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, నర్సింహారావు, ఉదయగిరి పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

హుజూర్‌నగర్, జూన్ 25: పట్టణంలోని శ్రీ వెంకట్వేరస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం స్వామివారిని యాగశాలలో ప్రవేశం చేసి గరుడహోమం, పూర్ణాహుతి,ధ్వజారోహణం, బలిహరణ, గరుడ ప్రసాదం నిర్వహించారు. అనంతరం సామూహిక విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ నెల 26న స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, వెంకటనారాయణ, రంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, జూన్ 25: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో మంగళవారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు పాల్గొన్నారు. కాగా, ఈడుప్పుగంటి సుబ్బారావు, పద్మజ దంపతులు వారి తల్లిదండ్రులు ఈడ్పుగంటి నారాయణ. ప్రమీల జ్ఞాపకార్థం ఆలయానికి వచ్చే భక్తులకు ఒకరోజు అన్నదానం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

నేరేడుచర్ల, జూన్ 25: మండలంలోని ప్రసిద్ధ సోమప్ప దేవాలయంలో మంగళవారం సంకటహర చతుర్థిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ఇరువంటి శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో ఆలయంలోని గణపతి విగ్రహానికి, శివలింగానికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామ పూజను గరికతో చేసి స్వామివారికి ఎర్రటి వస్త్రాలతో ముడుపు కట్టారు. ముడుపును మరుసటి రోజు స్వామి వారికి నివేదన చేస్తారు. ఇలా చేయడంతో కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఇలా మూడు, ఐదు, 11 వారాలు పాటించడం శుభప్రదంగా భావిస్తారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి ఇరువంటి శ్రీనివాసశాస్త్రి, నిర్వహించారు.

'జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి'

మఠంపల్లి, జూన్ 25: గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. జీపీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే ధర్నా, నిరసన కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంటి రవి, దేవదానం, బాలశౌరి, కిట్టయ్య, కొండలు, వినోద్, సైదానాయక్, ఆర్.ప్రభాకర్, నాగరాజు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేందుకు సర్వీసు రోడ్డు నిర్మించాలి



సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని ఆందోళన చేస్తున్న రైతులు

కోదాడ టౌన్, కోదాడ రూరల్, జూన్ 25: తమ వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని రైతులు ఆందోళన చేశారు. కోదాడ నుంచి ఖమ్మం వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారిలో కోదాడలోని దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద నిర్మిస్తున్న రింగ్‌రోడ్డు వద్ద సర్వీస్ రోడ్డు నిర్మించాలని పలువురు రైతులు కాంట్రాక్టు సంస్థ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రింగ్ రోడ్డు చుట్టూ సర్వీస్ రోడ్డు లేనందున సుమారు రెండున్నర కిలోమీటర్లు చుట్టూ తిరిగి తమ వ్యవసాయ పొలాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా గతంలో వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేవని, రోడ్డు విస్తరణలో వాటిని తొలగించి మళ్లీ కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించకుండా కాంట్రాక్టర్ ఇబ్బంది పెడుతున్నాడని తెలిపారు. అదేవిధంగా ఎన్ఎస్పీ కెనాల్‌పై కల్వర్టు నిర్మించకుండా అస్తవ్యస్తంగా రోడ్డును నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి, ఇరిగేషన్ విద్యుత్ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళను ఉధృతం చేస్తామని హెచ్చరించి ఆందరైతులకు న్యాయం చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించి ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు, తూములూరి సీతారామరాజు, భూలోకరావు, నరసయ్య, తిరుపయ్య, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, వీరబాబు, బాబ్జి పాల్గొన్నారు.

రుణమాఫీకి నిర్ణయం తీసుకోవడం హర్షనీయం



అర్వపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

అర్వపల్లి, సూర్యాపేట టౌన్, తిరుమలగిరి రూరల్, జూన్ 25: రైతుల పంట రుణాలకు ఒకే దఫా రూ.2లక్షలు మాఫీ చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అర్వపల్లిలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తి నియోజక వర్గంలో 1985నుంచి కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటూ ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. శ్రీరాంసాగర్ కాల్వల లైనింగ్, ఉపకాల్వల పిచ్చి మొక్కలు తొలగించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి విన్నవించానన్నారు. గత పాలకులు ఇసుక అక్రమాలతో కోట్లు దండుకున్నారని ఆరోపించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే సహించేదిలేదని ఎమ్మెల్యే మందుల సామేల్ హెచ్చరించడం అభినందనీయమన్నారు. ధరణి ప్రక్షాళనతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తుందని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దరూరి యోగానందాచార్యులు, గుడిపాటి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు సత్యం, వేల్పుల రమేష్, నసీర్‌గౌడ్, లక్ష్మణ్, కోటిప్రసాద్, సంపత్, నవీన్, హమీనోద్దీన్, అంజయ్య పాల్గొన్నారు

పేదలకు ఇంటి పట్టాలు ఇప్పించాలి

ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు పట్టాలు ఇప్పించాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. ఈ మేరకు సూర్యాపేటలోని కృష్ణాకాలనీలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కుడకుడ ప్రాంతంలోని సర్వే నెం.126లో ఉన్న ప్రభుత్వ భూమిలో నిరుపేదలు ఐదేళ్ల క్రితం గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని అన్నారు. ఆ గుడిసెలను బీఆర్ఎస్ నాయకులు, అధికారులు తీసివేసి అక్రమ కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకుపేదలకు 126గజాల చొప్పున ఇంటి పట్టాలతో పాటు, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున అందజేయాలన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ నాయకులు ఎర్ర అఖిల్‌కుమార్, చంద్రకళ, సూరం రేణుక, జయమ్మ, వాజిద్, సయ్యద్, లింగయ్య, పద్మ, రాజేష్, నారాయణ, మోహన్, గౌరమ్మ, రమణ, లక్ష్మి పాల్గొన్నారు.

తాటిపాముల గ్రామంలో సమస్యలు పరిష్కరించాలి

తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామంలో సమస్యను పరిష్కారించాలని ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు బి.కిషన్, ఎర్ర యాదగిరి కోరారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తాటిపాముల నుంచి కొండూరుకు వెళ్లే వాగుపై వంతెన నిర్మించాలని, పాఠశాలకు అదనపు గదులు నిర్మించాలని, మహిళా సంఘం భవనం, బీసీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్స్, 25కేవీ సబ్‌స్టేషన్ నుంచి గ్రామానికి ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటుచేయాలని వినతిప్రతం అందజేశారు. ఈ విషయమై మంత్రి ఉత్తమ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు అంజయ్య, రమేష్, సోమయ్య, మల్లేష్ ఉన్నారు.

వీవోఏపై చర్యలు తీసుకుంటాం

మద్దిరాల, జూన్ 25: ఇచ్చిన హామీ మేరకు స్త్రీనిధి డబ్బులను నెల రోజుల్లో చెల్లించని పక్షంలో వీవోఏపై చర్యలు తీసుకుంటామని డీపీఎం లక్ష్మీనారాయణ తెలిపారు. స్త్రీనిధి డబ్బులు దుర్వినియోగం అయ్యాయని మాజీ ఎంపీటీసీ పాల్వాయి కవిత కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మద్దిరాల మండలంలో గోరెంట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహిళ పొదుపు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో 16మహిళ పొదుపు సంఘాలు ఉన్నాయని తెలిపారు. గ్రామానికి చెందిన వీవోఏ సూరి శైలజ మహిళా సంఘాల నుంచి స్త్రీనిధి డబ్బులు రూ.28.10లక్షలు సొంతానికి వినియోగించుకున్నట్లు విచారణలో తేలిందన్నారు. సంబంధించిన మహిళ సంఘాల సభ్యులు వీవోఏను నిలదీయగా, డబ్బులు నెలలోపు చెల్లిస్తానని అధికారులకు హామీ ఇచ్చిందని తెలిపారు. డబ్బులు సకాలంలో చెల్లించని పక్షంలో క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో స్త్రీనిధి ఆర్ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం షైనయ్య, మధుకర్, డీఎంవో తోట్ల మల్లేష్, సీసీలు నాగార్జునరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

1.36లక్షల మొక్కలు సిద్ధం

నేరేడుచర్ల, జూన్ 25: హరితహారం కార్యక్రమంలో మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో 96వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏపీవో శేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నర్సరీలో లక్షా 36వేల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వ భూములు, ఖాళీ ప్రదేశాల్లో 96వేల మొక్కలు నాటేందుకు సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు.

పాఠశాలల భవనాల కోసం స్థలాల పరిశీలన

మేళ్లచెర్వు, జూన్ 25: నూతనంగా ఏర్పాటుచేయనున్న ప్రభుత్వ పాఠశాలల భవనాల కోసం స్థలాను ఆర్డీవో శ్రీనివాసులు పరిశీలించారు. మండలంలోని రేవూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.1088లోని ప్రభుత్వ స్థలాలను తహసీల్దార్ జ్యోతితో కలిసి మంగళవారం పరిశీలించారు. అదేవిధంగా రేవూరు, రామాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న పెట్రోల్ బంకుల స్థలాలను ఆర్డీవో పరిశీలించారు

సత్యాగ్రహంలో పాల్గొన్నవారికి సన్మానం



రంగాచార్యులు, నాగేశ్వరరావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కోదాడ, జూన్ 25: ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా సత్యాగ్రహంలో పాల్గొన్న వారిని బీజేపీ నాయకులు పట్టణంలో సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకడు బొలిశెట్టి కృష్ణయ్య మాట్లాడుతూ ఎమర్జెన్సీ విధించి 50ఏళ్లు పూర్తయిందని, ఆ సమయంలో పట్టణానికి చెందిన ఎన్‌సీ రంగాచార్యులు, సట్టు నాగేశ్వరరావు 18 నెలల పాటు జైలులో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో వారిని సన్మానించామన్నారు. కార్యక్రమంలో ఓరుగంటి పురుషోత్తం, బ్రాహ్మణపల్లి పవన్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, మునగాల శ్రీనివాస్, బాలాజీ, ఉడత విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



భానుపురి: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం జిల్లా స్థాయిలో ఎంపికలను ఈ నెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి కె.జగదీష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెం.9490023949 సంప్రదించాలన్నారు.

సూర్యాపేట అర్బన్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ, పాఠ్యపుస్తకాల విక్రయాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలెబోయిన కిరణ్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సింహాద్రి, రవి పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్‌గా మేళ్లచెరువు మండలం హేమ్లాతండాకు చెందిన ధరావత్ రవీందర్ ఎన్నికయ్యారు. హైదరబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో రవీందర్‌నాయక్‌ను నియామకపత్రాన్ని ఆ సంఘం అధ్యక్షుడు సంజీవ అందజేశారు.

● రాష్ట్ర ప్రభుత్వం 20వేల ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీని ప్రకటించి నిరుద్యోగులను ఆదుకోవాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చింత వెంకన్న ఒక ప్రకటనలో కోరారు. నిరుద్యోగులకు ఆటంకంగా మారిన జీవో నెం.46ను రద్దు చేసి నిరుద్యోగులను ఆదుకోవాలన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్‌గా సుబ్బరామిరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గరిడేపల్లి మండల అప్పన్నపేటకు చెందిన సుబ్బరామిరెడ్డి 2023లో విడుదలైన పోలీస్ రిక్రూట్‌మెంట్ ఫలితాల్లో ఫైర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, రవిబాబు, సురేందర్‌రెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

● కేవీపీఎస్‌జిల్లా స్థాయి శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు మట్రి నాగేశ్వరరావు కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శిక్షణా తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 30, జూలై ఒకటో తేదీన రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శీలం శ్రీను, మీసాల వీరబాబు, గొబ్బి అబ్రహం పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి శ్యాంకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హుజూర్‌నగర్ రూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు.పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పోసనబోయిన హుస్సేన్, హసన్ మియా, వీరారెడ్డి, రంగారెడ్డి, చంద్రం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తురక కొండలు కుటుంబానికి మునిసిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ మంగళవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పండ్ల హుస్సేన్, జగన్, అర్జున్, వీరబాబు, కొరివి రాము పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: నీట్ ప్రశ్నపత్రం లీకేజిపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందర్ రావు కోరారు. పట్టణంలోని శ్రామిక భవన్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో చంద్రశేఖర్, ప్రణీష్,అశోక్, రంగస్వామిపాల్గొన్నారు.

గరిడేపల్లి: మండల కేంద్రానికి చెందిన గొడుగు సైదులు, జానకమ్మలు తమ కుమార్తె హారిక జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, ఆర్ఎంపీ చంద్రయ్య,అనిల్, సైదులు, హరీష్ పాల్గొన్నారు.

మఠంపల్లి: నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏవో బొలిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు. మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఏఈవోలు భవన్, శ్రావ్య ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

● అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని ఎంఈవో పానుగోతు ఛత్రునాయక్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

మేళ్లచెర్వు: కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ రైతు పోరాట యోధుడు ఉస్తెల నారాయణరెడ్డి ఆశయాలను సాధించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నారాయణరెడ్డి కోరారు. మంగళవారం చింతలపాలెం మండల కేంద్రంలో సోమిరెడ్డి వెంకటరెడ్డి స్మారక భవనంలో వీరారెడ్డి ఆరో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వీరారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చీంతిరాల రవి, పాపిరెడ్డి, ఉప్పతల కోటమ్మ, అంకరాజు, వీరబాబు, పాషా, అంజయ్య, జియాలుద్దీన్, పద్మ, సత్యనారాయణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని చిమిర్యాల గ్రామానికి చెందిన రావూరి రాకేష్,లక్ష్మి దంపతుల కుమార్తె ఆరాధ్య అన్నప్రాశన కార్యక్రమం సందర్భంగా నల్లబండగూడెం సాయిబాబా దేవాలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ నల్లపాటి నరసింహారావు, రావూరి పూర్ణయ్య, నల్లూరి అప్పారావు, అల్సగాని బ్రహ్మయ్య, చిమిర్యాల పీఏసిఎస్ చైర్మన్ రఘుపతి, శరభయ్య, రమేష్, కొత్త బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనంతగిరి: దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని గోండ్రియాల ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం నందిపాటి సుధాకర్ అన్నారు. అందె వసుంధర తన తండ్రి శ్రీనివాస్ జ్ఞాపకార్థం రూ.5వేల విలువైన నోట్ పుస్తకాలను పాఠశా లలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హమీద్, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రైతులకు రూ2లక్షల రుణమాఫీ చేయాలని నిర్ణయించడం హర్షనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో విలేకరులతో వారు మాట్లాడారు.

చిలుకూరు: మండల కేంద్రంలోని పాత చిలుకూరు చెన్నకేశవ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన పిల్లుట్ల కనకయ్య ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా కనకయ్యను, డైరెక్టర్లుగా సోమగాని వీరబాబు, బాడిశ సురేష్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో పశువైద్యాధికారి వీరారెడ్డి, మాజీ అధ్యక్షుడు కస్తూరి నర్సయ్య, కొండా లక్ష్మయ్య, ఆవుల శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మునగాల రూరల్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం తేజోరామ్ అన్నారు. హరితహారంలో భాగంగా మండలంలోని కలకోవ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, వీరబాబు, మాడుగుల సత్యనారాయణ, నరసింహారావు, వెంకటేశ్వర్లు, నాగమణి, సైదులు పాల్గొన్నారు.

మద్దిరాల: మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన విజ్జాల నాగమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. నాగమణి భర్త ఎల్లేష్ స్నేహితులు ఆ కుటుంబానికి మంగళవారం రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు బరపటి అంజి, రవి, కిరణ్, నరేష్, నాగరాజు, దుగ్యాల గోపి పాల్గొన్నారు.

తిరుమలగిరి: 'నీట్' ప్రశ్నపత్రం లీకేజీకి నిరసనగా ఢిల్లీలో జరిగిన పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేడ్కర్, జీవన్, రంజిత్, అంజన్ తదితరులు పాల్గొన్నారు.

● సికిల్ సెల్ అనీమియా నివారణకు కృషిచేయాలని డాక్టర్ మల్లెల వందన అన్నారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధి నివారణ దినం సందర్భంగా తిరుమలగిరిలోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. గిరిజనుల్లో వంశపారంపర్యంగా ప్రతి నలుగురిలో ఒకరికి సికిల్ సెల్ అనీమియా వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బిచ్చునాయక్, హెచ్ఎంశ్రీను, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నాగారం: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను మండలంలోని ఫణిగిరి గ్రామానికి చెందిన పీసీసీ నాయకుడు పులిగిల్ల వీరమల్లు హైదరాబాద్‌లోని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వీరమల్లు మాట్లాడుతూ మండలంలోని ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించాలని మల్లన్నను కోరారు.